క్లుప్తంగా

నేటి నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం నుంచి జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని కమిటీ గురువారంలో ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 20116ను జంధ్రాజుపల్లి ముఖేష్, రెండో బహుమతి రూ. 15116 గెల్లా హరిబాబు మూడో బహుమతి రూ. 10116 బండి హనుమంతరావు, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ. 1116 గెల్లా ఏసుబాబు అందిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 25 టీమ్‌ల వరకు ఎంట్రీలు సమర్పించారని, శుక్రవారం వరకు ఎంట్రీలు స్వీకరిస్తామని మరిన్ని వివరాలకు చిన్న 86399 88910 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, పుబ్బ నక్షత్రం, దశమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

అద్దంకి రూరల్: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం శుక్రవారం అద్దంకిలోని కాకానిపాలెంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు గురువారం దేవస్థాన అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆరాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉదయం నుంచి జరిగే పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం అన్నదాన వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగికి వైద్య పరీక్షలను చేస్తున్న డాక్టర్ స్రవంతి

చీరాల: పట్టణంలోని కామాక్షి కేర్ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈశిబిరంలో ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణురాలు డాక్టర్ స్రవంతి 62 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన వారు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ చెవి, గొంతు, ముక్కు సమస్యలతో బాధపడుతున్న వారు త్వరగా వైద్య సేవలు పొందాలన్నారు. ఈ సమస్యలను అశ్రద్ధ చేస్తే దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. త్వరితంగా సమస్యలను పరిష్కరించుకుని వైద్యుల సూచనలు పాటిస్తే రోగాలకు గురికారన్నారు. అలానే పలురకాల సమస్యలతో బాధపడే వారికి తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ ఎండీ దేవరాజ్ సూచించారు. కార్యక్రమంలో షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ నవీన్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం.. ఉప్పు రైతుకు కష్టం



అకాల వర్షంతో కరిగిన నిల్వఉంచిన ఉప్పు రాశులు



వర్షం కారణంగా నీటితో నిండిపోయిన ఉప్పు కొఠారు భూములు

- ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఉప్పు రైతు సతమతం
- తీవ్రంగా నష్టపోతున్న ఉప్పు రైతు

చినగంజాం: ప్రతి కూల వాతావరణ పరిస్థితులతో ఉప్పు రైతు సతమతమవుతున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడం, ధర లేక పోవడం రైతులు ఉప్పు సాగుకు దూరమవుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చినగంజాం, కొత్తపట్నం, కనపర్తి తదితర ప్రాంతాల్లో ఉప్పు సాగు ఇబ్బుముబ్బడిగా సాగేది. తరచుగా తలెత్తుతున్న ప్రతికూల పరిస్థితులతో వందలాది మంది ఉప్పు రైతులు సాగుకు వెనుకాడుతున్నారు. బాపట్ల జిల్లాలో కేవలం చినగంజాం మండలంలో మాత్రమే ఉప్పు సాగు జరుగుతుంది. మండలంలో గతంలో సుమారు 3 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఉప్పు సాగు జరుగుతుండేది. ప్రస్తుతం కేవలం 1500 ఎకరాల్లో మాత్రమే రైతులు ఉప్పు సాగు చేస్తున్నారు. సుమారు వేయి ఎకరాలకు పైగా ఉప్పు భూములలో సాగు నిలిపివేశారు.

ఉప్పు రైతుకు కలిసి రాని కాలం..

సహజంగా ఉప్పు సాగు వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో జోరుగా పరిస్థితులుంటాయి. ఏడాదిలో నవంబరు, డిసెంబరు నెలలు మొదలుకొని జూలై వరకు ఉప్పు సాగును రైతులు చేపడతారు. అంటే సంవత్సర కాలంలో 9 నెలలు పాటు ఉప్పు సాగు జోరుగా సాగుతూ 3 నెలలు పాటు రైతులు ఖాళీగా ఉంటారు. కాని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులలో కేవలం 3 నెలలు పాటు ఉప్పు సాగు జరుగుతుండగా 9 నెలలు పాటు రైతులు భూములను ఖాళీగా ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సీజన్‌లో నవంబరు నెలలో వర్షాలు పడటంతో డిసెంబర్ నుంచి రైతులు ఉప్పు సాగు చేపట్టారు. ఉప్పు ఉత్పత్తికి వచ్చే సమయానికి మార్చినెలకు చేరుకుంది. రైతులు కేవలం మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండు మాసాలు ఉప్పును ఉత్పత్తి చేయగలిగారు. మే నెలలో ఇప్పటివరకు వారం రోజులు గడువులో రెండుసార్లు వర్షం కురవడంతో సాగు పూర్తిగా నిలిచిపోయింది. గత వారం కురిసిన వర్షానికి ఉప్పు మడులు వర్షపు నీటితో నిండిపోయి సాగు నిలిచి పోగా, బయటకు తీసి నిల్వ ఉంచిన ఉప్పు కువ్వలు వర్షానికి కరిగి పోయి రైతుకు నష్టం వాటిల్లింది. అదే విధంగా గురువారం కురిసిన వర్షంతో సాగు మరో 20 రోజుల పాటు నిలిచిపోయే పరిస్థితి వచ్చింది.

విపరీతంగా పెరిగిన ఉప్పు సాగు ఖర్చు..

ఉప్పు భూమిని సాగు సిద్ధం చేసేందుకు ఎకరాకు మట్టి ఖర్చు రూ.20 వేలు, ఉప్పు ఉత్పత్తి సమయంలో కూలీల ఖర్చు రూ. 10 వేలు మొత్తం రూ.30 వేలు అది కేవలం సొంత భూమి ఉన్న రైతులకు అవుతుంది. అదే కౌలు రైతుకు అదనంగా ఎకరాకు కౌలు రూ.20 వేలు నుంచి రూ.25 వేలు ఖర్చు అవుతుంది. భూమి నాణ్యతను బట్టి కౌలు రూ.32 వేలు కూడా పలుకుతుంది. సీజన్‌లో రైతు ఒక ఎకరాకు 30 బస్తాలు వరకు ఉప్పు ఉత్పత్తి చేస్తుండగా గతంలో 9 నెలలు పాటు సాగే సమయంలో కనీసం 20 పర్యాయాలు ఉప్పు ఉత్పత్తి చేపట్టే అనుకూలత ఉండేది. ప్రస్తుతం కేవలం 3 నెలలు మాత్రమే సాగుతున్న పరిస్థితులలో 9 నుంచి 10 సార్లు మాత్రమే ఉత్పత్తి జరుగుతుంది.

చివరి ఏడాది గిట్టుబాటు ధర బాగుంది..

బస్తా ఉప్పును ఉత్పత్తి చేసేందుకు రైతుకు రూ.250 నుండి రూ.270 వరకు ఖర్చు అవుతుంది. కనీసం బస్తా ఉప్పు అమ్మకం ధర రూ.300 పైగా ఉంటే రైతుకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి. గతంలో ఎకరాకు 30 బస్తాలు ఉత్పత్తి చేయగలిగిన రైతు ప్రతి కూల వాతావరణ పరిస్థితులతో ఎకరాకు 20 బస్తాలకు ఉత్పత్తిని చేయలేక పోతున్నాడు. గతేడాది ఉప్పు ఉత్పత్తి తక్కువగా ఉన్న సమయంలో బస్తా ధర రూ 700లు పలుకగా ప్రస్తుతం కేవలం రూ.200 మాత్రమే పలుకుతోంది. వర్షం కురుస్తున్న సమయంలో మరో రూ 20 నుంచి రూ .50 లు పెరుగుదల ఉన్నప్పటికీ రైతుకు సాగుకు అయ్యే ఖర్చు కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది.

ఉప్పు సాగు చేయాలంటే భయమేస్తుంది



నేను సుమారు 100 ఎకరాలు వరకు ఉప్పు సాగు చేస్తున్నాను. ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య సాగు చేయలేక పోతున్నాం. ఎకరా సాగుకు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. బస్తా ఉప్పుకు రూ.250 నుంచి రూ.270 వరకు అవుతుంది. సరైన ధర ఉండటం లేదు, ఉప్పు సాగు చేయాలంటే భయమేస్తుంది.

–గెల్లి వెంకట లక్ష్మీనారాయణ, ఉప్పు రైతు

అకాల వర్షంతో నష్టపోతున్నాం..



ఉప్పు ఉత్పత్తి అయ్యే సీజన్‌లో కురుస్తున్న అకాల వర్షం కారణంగా రైతులం తీవ్రంగా నష్టపోతున్నాం. సాగు ఖర్చులు, విద్యుత్ బిల్లులు కూడా విపరీతంగా పెరిగి పోవడంతో సాగు చేయలేక పోతున్నాం. దీనికి తోడు వాతావరణం కూడా సహకరించడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

–కందేపి సతీష్, ఉప్పు వ్యాపారి

ఎకరా కౌలు రూ. 20 వేలు..



కౌలు రైతు ప్రస్తుత సీజన్‌లో తట్టుకునే పరిస్థితి లేదు. కేవలం ఎకరా భూమికి రూ.20 వేలు పైగా కౌలు పెట్టాల్సి వస్తుంది దాంతో పాటు భూమిని సాగు సిద్ధం చేసుకునేందుకు మరో రూ.20 వేలు ఖర్చు అవుతుంది. నేను సొంతంగా కూలీ పని చేసుకోవడం నాకు కాస్తంత ఊరట.

–బొలిమెర రాంబాబు, ఉప్పు కౌలు రైతు

ఘనంగా అయ్యప్పస్వామి పూజ



అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: స్థానిక బాలకోటేశ్వర స్వామి ఆలయంలో హరిహర సుత అయ్యప్ప స్వామి గురువారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సతీష్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయ్యప్ప భక్త సమాజం సభ్యులు, బాలకోటేశ్వర స్వామి ఆలయం కమిటీ సభ్యులు, 9 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కారంచేడులో చిరుజల్లులు



స్వర్ణ-దగ్గుబాడు రోడ్డులో కల్లాల్లో మిరపకాయలపై పట్టా కప్పుతున్న రైతులు

కారంచేడు: మండలంలోని పలు గ్రామాల్లో ఊహించని విదంగా ఆకాశం వర్షించింది. గత మూడు రోజులుగా ఎండలు, ఉక్కపోతలతో అల్లాడుతున్న ప్రజానీకానికి వరుణుడు చిరుజల్లులు కురిపించాడు. మండల కేంద్రమైన కారంచేడుతో పాటు కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి, యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, పోతినవారిపాలెం, దగ్గుబాడు గ్రామాల్లోను చిరుజల్లులు పడ్డాయి. దీంతో పైగ్రామాలకు చెందిన ప్రజలు హమ్మయ్య అని సేదతీరుతున్నారు. ఇక అనుకోని విదంగా కురిసిన చిరు జల్లులతో కల్లాల మీద ఉన్న మిరపకాయలను కాపాడుకొనేందుకు రైతులు పరుగులు తీశారు. పరదాలు కప్పుకొని మిరపకాయలు తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొద్ది సేపటికే వర్షం ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

జాగ్రత్తలతో డెంగీ నివారణ సాధ్యం



బల్లికురవలో డెంగీపై అవగాహన ర్యాలీ..



డెంగీ నివారణపై స్వర్ణ పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ

- జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు
- దోమల నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలి
- వ్యక్తిగత, పరిస రాల పరిశుభ్రత తప్పనిసరి అంటున్న వైద్యులు

చినగంజాం/కారంచేడు: సరైన జాగ్రత్తలతో డెంగీ నివారణ సాధ్యమవుతుందని వైద్యులు పేర్కొన్నారు. దోమలు నివారణ కోసం ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ ఎస్ విజయభాస్కర్, డాక్టర్ పీ సాయిశ్రీచరణ్, డాక్టర్ బీ నాగేంద్రలు అన్నారు. చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ఎస్ విజయభాస్కర్, డాక్టర్ పీ సాయి శ్రీచరణ్, డాక్టర్ వై భవానీలు మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో 'డెంగీ వ్యాధిని నివారిద్దాం, దోమలు పుట్ట కూడదు, దోమలు కుట్ట కూడదు', అని నినాదం చేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగస్వామ్యమై నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకొని దోమలు ఉత్పత్తి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం రోజు డ్రైడే ప్రతి ఒక్కరూ పాటించి డెంగీని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిరంజీవి, ఉల్దారాణి, పీహెచ్‌ఎన్ బేబీ, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశలు, ఎల్‌టీ శ్యాం సుందర్‌బాబు, మురళి, మహేష్, ఎంఎన్‌ఓ సుబ్బారావు, కావ్య, సింగయ్యలు పాల్గొన్నారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ డెంగీ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బీ నాగేంద్ర పాల్గొని దోమలు నివారణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, హెచ్‌వీ వరదానం, హెచ్‌ఈ మాధవి, ఎల్టీ సుధ, ఫార్మసిస్ట్ శ్రీలక్ష్మి, స్టాఫ్ నర్స్ ఉదయ లక్ష్మి,హెల్త్ అసిస్టెంట్ జీ విజయప్రసన్న పాల్గొన్నారు.

➤ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, ఇంటి పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాల్సి ఉందని కారంచేడు, స్వర్ణ గ్రామాల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జెస్సీరాణి, డాక్టర్ షాలినీలు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు, స్వర్ణ పీహెచ్‌సీల పరిధిలో ఆయా గ్రామాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ర్యాలీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మురుగునీటితో పాటు, చెత్తా, చెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ముందు మురుగునీరు ప్రవహించేలా చూసుకోవాలన్నారు. కుళాయిల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఎయిర్ కూలర్లలో నీరును కూడా వారానికి ఒక సారి మార్చుకోవాలన్నారు. పూలకుండీలు, వాడనిటైర్లు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలుంటే కిరోసిన్ ఆయిల్, వాడిన ఇంజన్ ఆయిల్‌లను వేయడం వలన దోమలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీలు వీరమ్మ, మాధురీ సిఫోరా, శ్రీనివాసరావు, ఎల్‌టీలు సుబ్బారావు, బయ్యా శంకర్, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు..

బల్లికురవ/అద్దంకి: వర్షాల సీజన్ ఆరంభమవుతున్నందున డెంగీ జ్వరాలు సోకే ప్రమాదం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు జీ.



గాజులపాలెంలో ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి



సంతరావూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

రవితేజ, షేక్ రమీజ్ అహమ్మద్, భారతి కోరారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గుంటుపల్లి పీహెచ్‌సీ నుంచి గుంటుపల్లి–కొత్తపాలెం మీదుగా బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ జలుబు, దగ్గు, జ్వరంతో అస్వస్థతకు లోనైతే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

➤ డెంగీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూపీహెచ్‌సీ వైద్యుడు జయసింహ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా గురువారం ప్రజల భాగస్వామ్యంతో పట్టణంలో గాజులపాలెం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



కారంచేడులో డెంగీ అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు



మార్టూరు గ్రంథాలయంలో విద్యార్థులు..



విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

- గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

అద్దంకి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నామని గ్రంథపాలకుడు సుగురణరావు అన్నారు. ఆయన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం రెండో రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో 10–15 సంవత్సరాల వయసు కలిగిన వారికి శిబిరంలో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిబిరంలో డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, క్యారమ్స్, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇగ్లిష్, కథలు చదివించడం, ఆటలు ఆడించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అవకావాన్ని ఆయా వయసు కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్టూరు: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం మార్టూరులో గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథ పాలకుడు పావులూరి జానకి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలతో పాటు జాతీయ నాయకుల జీవిత చరిత్రల కథలను అందుబాటులో ఉంచి చదివించారు. చదరంగం, లూడో, క్యారమ్స్ వంటి ఆటలను విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతులకు విద్యార్థులను పంపించి అవకాశాన్ని వినియోగించుకోవాలని జానకి రామరావు తల్లిదండ్రులను కోరారు.

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథ పఠనంతో విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి చెప్పారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో విజ్ఞానం కలిగించేందుకు గ్రంథాలయ శాఖ ఈనెల 15 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించడం ప్రారంభించారని తెలిపారు. విజ్ఞాన శిమిరాల్లో విద్యార్థులు పాల్గొని వివిధ రకాల పుస్తకాలను చదివారు. వాటి గురించి గ్రంథపాలకుడు విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో తరగతి పుస్తకాలతోపాటు, వివిధ రకాల సైన్స్ సంబంధిత పుస్తకాలు, కాంపిటీషన్ పుస్తకాలు, కథల పుస్తకాలు ఫిలాసఫీ పుస్తకాలు లభిస్తాయని చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారుడికి రోటరీ ఆర్థిక సాయం

చీరాల అర్బన్: చైనాలో జరిగే బీచ్ పెరా వాలీ వరల్డ్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన పందిళ్లపల్లికి చెందిన పిచ్చుక నాగరాజు అనే దివ్యాంగ క్రీడాకారుడికి రోటరీ క్లబ్ ప్రతినిధులు రూ.13 వేలు ఆర్థిక సహాయం అందించారు. గురువారం స్థానిక రోటరీ కమ్యూనిటి హాలులో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందించారు. నాగరాజు క్రీడలలో రాణించి చీరాలకు మంచి పేరు తీసుకు రావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ళ గురుప్రసాద్, బి.హేమంత్‌కుమార్, డివి సురేష్, జివై ప్రసాద్, ఎస్‌వి స్వామి, శేష



క్రీడాకారునికి ఆర్థికి సాయం అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

సాయి, గుర్రం రాఘవరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు



తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

చీరాల టౌన్: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు. 7వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీలు ఈనెల 4 నుంచి 6 వరకు గోవాలో యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. తైక్వాండో పోటీల్లో చీరాలకు చెందిన 18 మంది క్రీడాకారులు పతకాల పంట పండించారు. చీరాల తైక్వాండో క్లబ్ తరపున వివిధ కేటగిరిల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో 13 మంది బంగారు పతకాలు, 5 మంది సిల్వర్ పతకాలు సాధించారని చీరాల తైక్వాండో కోచ్ సయ్యద్ సలావుద్దీన్ గురువారం తెలిపారు. యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు హెచ్.రవిశంకర్‌రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో 44 కేజీల విభాగంలో చిలకా విజయ్‌కుమార్ బంగారు, షేక్ మహ్మద్ సోహైల్ బంగారు, అండర్–17 కేజీల విభాగంలో ఎల్.కార్తిక్ బంగారం, అండర్ 18 కేజీల విభాగంలో ఎల్.సమత బంగారు. అండర్–17 కేజీల విభాగంలో షేక్ హఫ్స బంగారు, పిల్లి ప్రశాంత్ బంగారు పతకాలు సాధించారు. అండర్–78 విభాగంలో పిల్లి స్టీఫెన్‌జాన్‌పాల్ బంగారు, అండర్–57 కేజీల విభాగంలో పిల్లి మేరీ స్టెల్లా బంగారు, అండర్–52 కేజీల విభాగంలో ఎస్‌జేడీ మాసిలి బంగారు పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో బి.ఏడుకొండలు, కె.కరుణసాగర్ బంగారు పతకాలు, అండర్–23 కేజీల విభాగంలో ఎం.లీలామాదవ్ బంగారు, అండర్–65 కేజీలు షేక్ అబ్దుల్ ఆశిక్ వెండి, అండర్ 45 కేజీల విభాగంలో షేక్ అబ్దుల్ నాశిక్ వెండి, పి.గోపిశంకర్ అండర్–45 విభాగంలో వెండి, అండర్–48 కేజీల విభాగంలో షేక్ కాలేషావలి వెండి, అండర్–52 కేజీల విభాగంలో పుట్టా కార్తీక్ వెండి పతకం సాధించారని కోచ్ సలావుద్దీన్ తెలిపారు. తైక్వాండో జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభచూపి పతకాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్‌లు పి.ప్రశాంత్‌బాబు, సీహెచ్.వెంకటప్రసాద్, పలువురు తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు



గాయలైన వృద్ధురాలు, బాలుడు



నుజ్జునుజ్జయిన కారు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనకగా వస్తున్న కారు ఢీకొట్టిన ఘటన గురువారం అద్దంకి మండలంలోని నామ్ హైవే పై చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న కారు మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై నున్న అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి గ్రామం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు వృద్ధురాలికి, బాలుడికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి వైద్యశాలలకు తరలించారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది.

